క్లుప్తంగా

రోడ్డు మార్జిన్‌లో కంపచెట్ల తొలగింపు

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్పందించిన అధికారులు

బంటుమిల్లి: పెదతుమ్మిడి పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి–గుడివాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లోని కంప చెట్ల తొలగింపు పనులను పంచాయతీ అధికారులు ఆదివారం చేపట్టారు. ఈ నెల 17వ తేదీన బంటుమిల్లిలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రోడ్డు మార్జిన్‌లోని కంపచెట్లతో ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు ప్రజలు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాజాబాబు రోడ్డు మార్జిన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను పంచాయతీ నిధులతో వెంటనే చేపట్టాలని కార్యదర్శి దాసరి శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ మేరకు సచివాలయ కార్యదర్శి జి. భరత్‌కుమార్ పర్యవేక్షణలో జేసీబీ సాయంతో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అధికారులు స్పందించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చల్లపల్లి: ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను తమ స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని మహిళా పోలీస్ సీహెచ్ సరళ అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని లైబ్రేరియన్ కె.గణేష్‌కుమార్ విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. లక్ష్మీపురం లైబ్రేరియన్ టి.రాంబాబు, పాఠకులు పాల్గొన్నారు.

రజక సంఘం సాయం



చల్లపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్ట్ కోట్లపల్లి చంద్ర కుటుంబానికి పాగోలు గ్రామ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఆదివారం స్థానిక రజక బజారులోని చంద్ర ఇంటి వద్ద అతని పిల్లలకు రూ.21 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘ అధ్యక్షుడు పాగోలు వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ముక్కొల్లు శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ చల్లపల్లి ప్రెస్ క్లబ్ ద్వారా రూ.10 వేల సహాయాన్ని చంద్ర కుటుంబానికి అందజేశారు. మంగళాపురం రావెళ్ల కృష్ణ సేవా సమితి తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని సమితి అధ్యక్షుడు నిడమానూరి దిలీప్ కుమార్ ప్రెస్‌క్లబ్ ద్వారా అందచేశారు.

ఆలయంలో అన్నసమారాధన



మోపిదేవి: మోపిదేవి దేవుని చెట్టు వద్ద వెలసిన బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో సుమారు 10 వేల మందికి పైగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా ప్రతి ఏడాది ఇక్కడ అన్నసమారాధన నిర్వహిస్తారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. మోపిదేవి, అవనిగడ్డ మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, అయ్యప్ప స్వాములు సేవలు అందించారు. కొండేటి మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన పింఛనుదారు అబ్దుల్ షాజాది ఇటీవల మృతి చెందారు. డివిజన్‌కు చెందిన తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన మొత్తం రూ. 36,200 వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్ సమక్షంలో షాజాది కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తాహెర్‌పాషా, ఆరిఫ్, రిజ్వాన్, సలీమ్, మక్బుల్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

- రూ.143కు పెరిగిన ధాన్యం ధర
- పెడన నియోజకవర్గంలో 54 కేంద్రాల ఏర్పాటు
- డీసీఎంఎస్ ద్వారా 20 కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా 34 కేంద్రాల ఏర్పాటు

పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు కొనుగోలుకు సంబంధించి పరికరాలను అందజేసింది. ఆయా ఆర్‌బీకేలలో డీసీఎంఎస్, పీఏసీఎస్‌లకు సంబంధించిన సిబ్బంది ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ఆర్‌బీకేలలోని వీఏఏల పర్యవేక్షణలో డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల సిబ్బందికి తేమ శాతం ఏవిధంగా లెక్కించాలి, భారత ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను అనుసరించి వ్యర్థ పదార్థాలు, రంగు మారిన, కుచించుకుపోయిన, తక్కువ శ్రేణి గింజల గుర్తింపు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ క్రాప్ చేసుకుని ఈకేవైసీ పూర్తయిన రైతులంతా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.143 పెంపుదల..

గత ఏడాది కంటే ఈ ఏడాది ధాన్యం ధరను రూ.143కు పెంచారు. సాధారణ రకం క్వింటా ధర గత ఏడాది రూ.2,043 లు ఉంటే ఈ ఏడాది రూ.2,183 చేశారు. 75 కిలోల ధర ఈ ఏడాది రూ.1,637 చేశారు. గ్రేడ్ –ఎ రకం క్వింటా ధర నిరుడు రూ.2,060 ఉంటే ఈ ఏడాది రూ.2,203లకు కొనుగోలు చేయనున్నారు. 75 కిలోల ధర ఈ ఏడాది రూ.1,652 లు చేశారు.



రాసిగా పోసిన ధాన్యం



నూర్పిళ్లు చేస్తున్న రైతులు

డీసీఎంఎస్ ద్వారా 20, పీఏసీఎస్‌ల ద్వారా 34 కేంద్రాలు..

పెడన నియోజకవర్గంలోని ఆర్‌బీకేలలో 20 డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం)లు, 34 పీఏసీఎస్ (ప్రాథమిక సహకార పరపతి సంఘం) ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారు. పెడన మండలంలో ఆర్‌బీకేలలో డీసీఎంఎస్‌ల ద్వారా చోడవరం, కొంకేపూడి, నడుపూరు, నందిగామ, పెడన అర్బన్, పెడన (మడక)లో కొనుగోలు చేయనున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా అచ్చయ్యవారిపాలెం, చెన్నూరు, చేవేంద్ర, గురువిందగుంట, కాకర్లమూడి, కమలాపురం, కొప్పల్లి, నందమూరు, పెనుమల్లి, పుల్లపాడులో కొనుగోలు చేయనున్నారు. బంటుమిల్లి మండలంలో డీసీఎంఎస్‌ల ద్వారా ఆముదాలపల్లి, అర్తమూరు–1, అర్తమూరు(మణిమేశ్వరం)–2, బంటుమిల్లి–1, చోరంపూడి, మల్లేశ్వరం, మలపరాజుగూడెం, ములపర్రు, నాగేశ్వరరావుపేట, పెదతుమ్మిడి, పెందుర్రు, సాతులూరులు ఉన్నాయి. పీఏసీఎస్‌ల ద్వారా కంచడం, ముంజులూరు ఆర్‌బీకేలలో కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గూడూరు మండలంలో అన్ని ఆర్‌బీకేలలో పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేయనున్నారు. ఆకులమన్నాడు, గూడూరు–1, గూడూరు–2, ఐదుగుళ్లపల్లి, కంచాకోడూరు, కంకటావ, కప్పలదొడ్డి, కోకనారాయణపాలెం, లేళ్లగరువు, మల్లవోలు–1, 2, ముక్కొలు, పోసినవారిపాలెం, రామరాజుపాలెం, రాయవరం, తరకటూరులు ఉన్నాయి. కృత్తివెన్ను మండలంలో డీసీఎంఎస్ ద్వారా చినపాండ్రక–1, 2లలో కొనుగోలు చేయనున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా కృత్తివెన్ను, కోమళ్లపూడి, లక్ష్మీపురం, నీలుపూడి, శీతనపల్లి, యండపల్లి ఆర్‌బీకేలు ఉన్నాయి.

కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి



ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఆర్‌బీకేలలో సిబ్బంది అంతా సిద్ధంగా ఉన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించి వీఏఏల పర్యవేక్షణలో డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల సిబ్బంది ఉంటారు. ఇన్‌చార్జి, సాంకేతిక నిపుణుడు, డేటా ఆపరేటర్, హెల్పర్, వ్యవసాయశాఖ వీఏఏ ఈ ఐదుగురు ఆర్‌బీకేలలో ఉంటారు. ఇప్పటికే మండల కేంద్రాలకు గన్నీబ్యాగులు వచ్చాయి. ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభించారు. ధాన్యం పూర్తిగా ఆరిన తరువాత తీసుకురావాలని రైతులకు సూచించాం. ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల్లో కాకుండా బయట విక్రయించుకుంటే ఆర్‌బీకేలలో తప్పనిసరిగా వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

– జీవీ శ్రీనివాసరావు, ఏఓ, పెడన మండలం

దివి ఉప్పెన మృతులకు నివాళి



అవనిగడ్డ: 1977 ఉప్పెన మృతులకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఘన నివాళులర్పించారు. మండల పరిధిలోని పులిగడ్డ ఉప్పెన మృతుల పైలాన్ వద్ద ఎమ్మెల్యే సింహాద్రి కొవ్వొత్తులు వెలిగించి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనాటి ఘోరకలి దివిసీమకు ఓ పీడకల అన్నారు. ఉప్పెన బాధితులకు స్వచ్ఛంద సంస్థలు అందించిన సేవలు ఎనలేనివని చెప్పారు. ఉప్పెన వల్ల కకావికలమైన దివిసీమను సాధారణ స్థితికి తీసుకు వచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన కార్యక్రమాలు మరువలేనిన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం తరచూ విపత్తులకు గురయ్యే ప్రాంతమని, ఈ ప్రత్యేక పరిస్థితులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి ఎక్కువ నిధులు మంజూరు చేసేలా చూడాలని కోరామని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి

రావివారిపాలెం(మోపిదేవి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి మహిళా సాధికారత సాధించాలని గ్రామ ప్రముఖురాలు రావి జ్యోత్స్న అన్నారు. మండల పరిధిలోని రావివారిపాలెంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి, దిశ చట్టంపై అవగాహన కల్పించారు. పలువురు మహిళలు, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ పాలకుడు కె. సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కోడూరులో ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్ ప్రారంభం



ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాసరావు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం కోడూరు పాత రామకృష్ణ థియేటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్‌ను రమేష్‌బాబు ప్రారంభించారు. మత్స్యశాఖ ఎఫ్‌డీఓ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. మత్స్యకారులు సేకరించిన సంపదను గ్రామ స్థాయిలో విక్రయించుకొనేలా ఫిష్ ఆంధ్ర పేరుతో అనేక చోట్ల అవుట్‌లెట్లను ఏర్పాటు చేశారని చెప్పారు. మత్స్య సంపదను ప్రత్యేక యూనిట్ల ద్వారా విక్రయించుకొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవుట్‌లెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, మత్స్యకారులు కూడా ఈ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. బయట మార్కెట్‌లోకి వెళ్లి మత్స్య ఉత్పత్తులను విక్రయించే అవకాశం లేకుండా ఈ యూనిట్‌లోనే విక్రయాలు జరుపుకోవచ్చని వివరించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా కోడూరులో కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావుకు ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్‌ను కేటాయించామని జిల్లా మత్స్య శాఖాధికారి ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌కు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందించిందన్నారు. ప్రజలకు నాణ్యమైన మత్స్య సంపదను విక్రయించాలని శ్రీనివాసరావు సూచించారు.

అనంతరం యూనిట్ లోపల ఉన్న చేపల తొట్టెలను పరిశీలించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, కోట పద్మావతి వరప్రసాద్, మత్స్యశాఖ డివిజినల్ అధికారి ఆర్.ప్రతిభ, వీఎఫ్ఏలు, నాయకులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు తెచ్చారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 33వ డివిజన్‌లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ ఆధ్వర్యంలో ప్రజలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్ని కిట్టుకు ఘన స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పేర్ని కిట్టు చేతికి ఇమామే జామిన్ కట్టారు. ఈ సందర్భంగా ఆ డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని పంజాలు, దర్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో పేర్ని కిట్టు ఉర్దూలో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పలు డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



వృద్ధుడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

104, 108 సిబ్బందికి సన్మానం

పెడన: విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అత్యవసర సేవలందించిన 104, 108 సిబ్బందిని స్థానిక సహాయ ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఆదివారం స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్‌ఖాన్ అధ్యక్షతన స్థానిక యువ పారిశ్రామికవేత్త, ప్రజా సేవకుడు గాజుల సాంబయ్య సహకారంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫౌండేషన్ బాధితులకు ఆర్థిక సాయంతోపాటు ఉత్తమ సేవలందిస్తున్న 104, 108 సిబ్బందిని గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా సేవా పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. అరబిందో ఎమర్జెన్సీ సర్వీసెస్ ఏపీ ప్రాజెక్టు మేనేజరు సత్యనారాయణ, జోనల్ మేనేజరు శివరాకేష్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టరు ఎస్‌బీ సతీష్, 108 విభాగం మేనేజరు ఎల్. హరీష్‌రెడ్డి, పలు డివిజన్ల కో–ఆర్డినేటర్లు, ఫౌండేషన్ సభ్యులు, 104, 108 సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



104, 108 సిబ్బందిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కేంద్రప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

మచిలీపట్నంటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలతో ఆయా వర్గాలను మోసం చేస్తోందని, వారి విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ఉమామహేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆదివారం స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఆయా వర్గాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాలతో పాటు ప్రజలు బీజేపీని గద్దె దించి బుద్ధి చెప్పాలని కోరారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరించిందన్నారు. కార్మిక సంఘాల పోరాటాల వల్ల సాధించుకున్న హక్కులను కేంద్రం అమలు చేయని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీని గద్దె దించడం ప్రజా ఐక్య సంఘటన ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరుగనున్న 48 గంటల మహాధర్నాలో కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు వై. నరసింహారావు, ధనశ్రీ, రాజేశ్వరరావు, రంగారావు, నాయకులు పాల్గొన్నారు.

బిగ్ స్క్రీన్‌ల వద్ద సందడి



అవనిగడ్డలో బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరు పార్కులో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమానులు

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ: భారత్–ఆస్ట్రేలియా మధ్య వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు అవనిగడ్డ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో, కోనేరు సెంటర్, మునిసిపల్ ప్రధాన పార్కులో ఆదివారం బిగ్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. అవనిగడ్డలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తిలకించారు.

బందరులో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్క్రీన్లలో కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు మ్యాచ్‌ను తిలకించారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



గూడూరులో రంగవల్లులు వేస్తున్న బాలికలు




బందరులో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

గూడూరు: 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గూడూరులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. స్థానిక బాలికలు పోటీల్లో పాల్గొని వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. గ్రంథాలయ అధికారి వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.


బందరులో విశేష స్పందన

మచిలీపట్నంటౌన్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. 210 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొని వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం దిశ చట్టంపై విద్యార్థినులు అభిప్రాయాలను వెల్లడించారు. పోటీలను ఎస్ఐ మస్తాన్‌ఖాన్ గ్రంథాలయ అధికారులు వై. జయలక్ష్మి, డి. వాసవి, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రామారావు పర్యవేక్షించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్టూన్ల ప్రదర్శన ఆకట్టుకుంది. చిలకలపూడి శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కనుల పండువగా కార్తిక దీపోత్సవం



శివలింగం రంగవల్లి చుట్టూ కార్తిక దీపాలు



దీపకాంతులతో వెలుగొందుతున్న ఆలయ ప్రాంగణం

కోడూరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కోడూరు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతి, నందీశ్వరుడి రంగవల్లులను తీర్చిదిద్ది వాటి చుట్టూ కార్తిక దీపాలను వెలిగించారు. వీటితో పాటు ఆలయం చుట్టూ స్వస్తిక్, ఓంకారం ఆకారాల్లో మహిళలు దీపాలు వెలిగించారు. స్థానిక వ్యాపారి కోడూరు వెంకటేశ్వరరావు దంపతులు దీపోత్సవానికి కర్తలుగా వ్యవహరించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్బారాయుడు ఆలయం కిటకిట



సుబ్బారాయుడి ఆలయం నాగపుట్టలో పాలుపోస్తున్న భక్తులు



నాగమల్లి వృక్షం వద్ద భక్తుల కోలాహలం

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కార్తికమాసం, ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్ భక్తులతో కిటకిటలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం అందజేత

పోచిగానిలంక(మోపిదేవి): పోచిగానిలంకకు చెందిన రేపల్లె వెంకటపున్నయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. అవనిగడ్డ శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయడు రూ. 7 వేలను బాధితుడికి ఆదివారం అందజేశారు. రంగస్థల కళాకారులు పుప్పాల వీరాంజనేయులు, గరికిపాటి వీరాంజనేయులు, గరికిపాటి నాగబాబు, పుప్పాల రాఘవయ్య, రేపల్లె కృష్ణారావు పాల్గొన్నారు.